# వెల్లువలో పూచికలు

ఇల్లు ఒకటిలా ఒంటరిది.

ఇంట్లో మనుషులు ఒకటో ఎక్కం లాంటి వాళ్ళు.

మరే అంకెనైనా వాళ్ళు ఒకటి చేత మాత్రమే గుణించ కలిగిన వాళ్ళు.

ఇల్లు—పల్లెకీ, రైల్వేస్టేషన్‌కీ మధ్య డొంకమీద వుంది. డొంక పక్కన ఊడలమర్రి వుంది. దానిక్రింద వెలిసిన రెల్లుపాక అది.

ఇంట్లోవాళ్లు ఎప్పుడూ కాకమీద వుంటారు. తెల్లవారుఝామున నాలుగుగంటలనుంచీ, చివరి రైలు వెళ్లిపోయే సమయం — అంటే రాత్రి పదకొండు దాకా — ఊక పొయ్యి మండుతూనేవుంటుంది; బాయిలేర్‌లో నీళ్లు తెర్లుతూనే వుంటాయి; ఒకటో అరో పాసెంజర్లు టీ కోసమో, రొట్టెకోసమో వస్తూనే వుంటారు.

ఆ తర్వాత — కీచురాళ్లస్వరాలూ; బావురుమంటున్న పొలిమేరల ప్రశాంతీ ఆ పాకని కప్పేస్తాయి.

— పల్లె పదిలా బలమైనది; బలిసింది.

పల్లెలో మనుషులు పదో ఎక్కం లాంటి వాళ్లు.

వాళ్లు — ఎప్పుడూ పదిని మరోపదితో గుణించటానికే అలవాటు పడిన వాళ్లు.

— ఇంట్లో, నాయర్ వుంటాడు. అతనికి సమస్త ప్రపంచమూ — లోగదిలో కుక్కిమంచమే. రెండేళ్ల క్రితం వచ్చిన పక్షవాతం అతనికి తోడూ, నీడా. మానసికంగా అతను ఆ జబ్బుతో తాదాత్మ్యం చెంది — నిట్టూర్పులూ, అవులింతలతో కాలం గడిపేయడానికి అలవాటు పడ్డాడు,

నాయర్ భార్య తంగం. అతను మంచంలో వడకవేసిన నాటి నుంచీ హోటల్ బాధ్యత అంతా ఆమే స్వీకరించింది. అంతకుముందు అతనికి చేదోడుగా మాత్రమే వుంటూ వుండేది — తంగం. ఇప్పుడు తనే పూర్తిగా చేతులు కాల్చుకోక తప్పడంలేదు.

నాయర్‌కి ముగ్గురు పిల్లలూ; తంగంకి అయిదుగురు పిల్లలూ. నాయర్ రక్షణలోకి వచ్చి — ఈ పల్లెకి చేరేసరికే తంగంకు ఇద్దరు పిల్లలు. అందరిలోకీ పెద్దపిల్ల కుట్టి. ఆమెకి పందొమ్మిదేళ్లు. ఆ తర్వాత పిల్లకి పదహారు. మూడో పిల్లకి పన్నెండు. నాలుగో వాడికి పదేళ్లు. ఐదోది మళ్లీ ఆడపిల్లే. దానికి ఆరేళ్లు.

తంగంకి నలభై ఏళ్ల వయసుంది. కాయకష్టం చేసి రాటు దేలిన బలిష్ఠమైన దేహం వుంది. చాయ కొంచెం నలుపే అయినా, ఆత్మవిశ్వాసం తొణికిసలాడే కళ గల మొహం వుంది. బాగా ఎత్తరి. మొదటిసారి చూసిన వాళ్లు — ఓ క్షణం పరకాయించి చూసి — 'అందగత్తే, బావుంది' అనుకోగల అంగసౌష్ఠవం వుంది.

కుట్టి — ముద్దబంతిలాంటిది. ఆమెది లేత పసుపుపచ్చ వన్నె. ఓణీ జాకెట్లలో ఒదగని అందాలు పాసెంజర్ల చేత గుటకలు వేయిస్తూ వుంటాయి. మనిషి పుత్తడిబొమ్మే కానీ — మాటలేదు. ఆమెకు అదొక శాపం. మూగతనాన్ని మోసుకుంటూ ఈ లోకంలోకొచ్చింది.

— పల్లెలో తిమ్మయ్య వున్నాడు. పల్లె అంతా ఆయనది;

పల్లెలో వున్న భూములన్నీ ఆయనవి. పల్లెలో మనుషులంతా ఆయన వాళ్లు. అంతెందుకు — పల్లెలో స్థిరాస్తులన్నీ ఆయన కనుసన్నల్లో కదలికలు సాగించాల్సిందే; మానవ మాత్రులనబడే వాళ్లంతా ఆయన 'దయాధర్మాల' మీద ఆధారపడవలసిందే! తిమ్మయ్యకు భార్యా వియోగం జరిగింది కానీ — భౌతికంగా, పెళ్లాంలేని లోటు కలుగలేదు. ఆయనగారి సిరిగురించీ, మగసిరి గురించీ పల్లెకు బాగా తెలుసు; ఆయా సంగతుల్ని గురించి చాలామంది చెవులు కొరుక్కోవడం చుట్టుపక్కల చాలా పల్లెలకు తెలుసు. వాస్తవాలకీ సాక్షులు మాత్రం ఆయన కిర్రు చెప్పులూ పొన్ను కర్రా?

తిమ్మయ్య కొడుకు రామదాసు. అతను ఆయనగారి గారాలకూచి. రామదాసుకు వయసొచ్చింది — కానీ చదువు రాలేదు. పదో తరగతి నాలుగుసార్లు దండయాత్ర చేసి తెల్లజండా ఎత్తేశాడు. బంగారప్పళ్లెంలో పాలుపోసి అంచున వెన్నముద్దపెట్టే అవ్వ చేతి తిండి — అతన్నో వస్తాదులా పెంచింది. అందుకే ఇరవై ఏళ్లకే ముప్ఫై ఏళ్ల వాడిలా కనిపిస్తాడు. రామదాసు దినచర్య — పొలంగట్టునైనా, రామ మందిరం అరుగు మీదైనా, వాళ్లయింటి వసారా గదిలోనైనా — పేకాటకు అంకితమై పోయింది.

ఇవాళ —

ఇల్లంతా శ్మశాన నిశ్శబ్దం అలుముకుని వుంది.

బాయిలేర్‌లో నాలుగు బొగ్గు తునకలు పడేసి కళ్లు తుడుచుకుంది తంగం. పనిచేసుకు పోతున్నదన్న మాటేగానీ, పొద్దుట్నుంచీ ఆమెకు గుండెల్లో మంటగా వుంది. బాధని కళ్లకొసల్లో పట్టి వుంచింది. ఇప్పుడో, ఇంకో క్షణానికో వర్షించబోయే మేఘాల్లా వున్నాయి — ఆమె కళ్లు.

'ఒక లైట్ టీ వెయ్ — తంగం' — ఓ మూలనుంచీ అరుపు వినిపించింది.

ఆ పిలుపు ఆమెకు కొత్త కాదు. రాజయ్యది. రాజయ్య ఆమెకు బాగా పాతబడిన 'పాసెంజరు'. ఐదేళ్ల క్రితం రెల్లుపాకలో టీ బంకు ప్రారంభించమని నాయర్‌కి సలహా ఇచ్చింది రాజయ్యే. అంతకుముందు — తినుబండారాల్ని తయారుచేసుకుని తోపుడు బండిలో రోడ్ల వెంట తిరిగి అమ్ముకుంటూ వుండేవాడు — నాయర్. పెట్టుబడి క్రింద రాజయ్య రాసో, కూసో డబ్బు కూడా సర్దుబాటు చేశాడనీ, దానికి ప్రతిఫలంగా తంగంని బాగానే వాడుకున్నాడనీ — కొంతమంది గ్రామస్థులు చెప్పుకోవడం తంగం వినకపోలేదు.

టీ కలిపి కొడుకుచేత పంపింది తంగం.

'గ్లాసుని తనే తెచ్చిస్తే ఆ బంగారపు చేతులు అరిగి పోతయ్ కామోసు' అని నిష్ఠూరాలాడుతూ టీ తాగేడు — రాజయ్య.

సమాధానం చెప్పలేదు — తంగం. టీ తాగటం పూర్తి చేసి తంగం నిలుచున్న గట్టు దగ్గరసా వచ్చేడు రాజయ్య. ఆమె కళ్ళల్లోకి చూసేడు. మొహం పక్కకు తిప్పుకుంది తంగం.

"ఏం, అట్టాగున్నావ్" అడిగేడు. తంగం మాట్లాడలేదు. చెంగుతో కళ్ళొత్తుకుంది. చిల్లరని సీనారేకు ట్రేలో పడేసి — పోతూ పోతూ మళ్ళీ వెనక్కి వచ్చేడు రాజయ్య. 'టౌన్ కెల్తన్నా. ఏఁవన్నా కావాలంటే చెప్పు'— అన్నాడు. 'ఏఁవఖ్ఖర్లా' అంది తంగం.

రాజయ్య వెళ్ళిపోయాడు. తడికె పక్కగా వున్న నాయర్‌కి రాజయ్య మాటలు వినిపించినై. 'పంచదార తెచ్చిపెట్టమనకపోయావ్' అన్నాడు, సన్నగా. 'వచ్చులే నువ్ పడుకో' అంది తంగం — కొంచెం విసుగుదలతో.

రెల్లు పాకలో ఇప్పుడు పాసెంజర్లెవ్వరూ లేరు. గట్టుదిగి ఇవతలకి వచ్చి పక్కనున్న బల్లమీద కూర్చుంది తంగం. నిజానికి అది బల్లకాదు. ఒంటిరాయి వెడల్పున అ చివరా ఈ చివరా రెండు అడుగుల ఎత్తులో స్తంభాల్లా కట్టి వాటిమీద వేసిన పొరాటు చెక్క. తంగం కూర్చోగానే అ చెక్క ముందుకి వొరిగిపోయింది. పడబోయి తట్టుకుంది. చెక్కని ఈదురుగా సర్దుకుని కూర్చుంది.

ఎదురుగా దొడ్డి గడపలో ప్లేట్లూ, గ్లాసులూ తోలుస్తోంది — కుట్టి. కూతురికేసి నిమ్మళంగా చూసింది, తంగం. ఒక్కసారిగా బాధ కట్టలు తెంచుకుంది. ఏడుపు ముంచుకొచ్చింది.

ఈ సమస్యని రాజయ్యకి చెప్తేనే బాగుండేదా అనే సందేహం కలిగింది తంగంకి. కావాలనే తనీ సంగతి చెప్పలేదు. అతనంటే తిమ్మయ్యకిపడదు. ఇద్దరూ బద్ధశత్రువులు. తనీ విషయం రాజయ్యకి చెప్తే రాజయ్యా, తిమ్మయ్యా వీధినపడతారు; తననీ వీధిన పడేస్తారు. అందుకనే తను తొందరపడ దలుచుకోలేదు.

రామదాసు చేసిన హెచ్చరిక చెవుల్లో మ్రోగుతోంది తంగంకి.

నాలుగురోజుల నాడు —

రాత్రి —

పొలంనుంచీ యింటికి పోతూ — తన యింటి ముందుగా అగేడు తిమ్మయ్య. తను బయటి కొచ్చి నిల్చుంది. పొన్నుకర్ర మీద నడ్డి అనించి, ధీమాగా నిలబడి మొదలెట్టేడు.

"ఏం తంగం — మీరు చాలా గొప్పోళ్ళైపోయారంట.'

తనకి గుండెలు గుభేలు మన్నై. 'అహఁహఁ' అంటూ ఏదో చెప్పబోయింది.

తన మాటకు అడ్డొస్తూ — 'మావాడు అంతా సెప్పాల్లదే. ఊళ్లో

జనమంతా మిమ్మల్నిడ నుంచీ పంపింసెయ్య మంటున్నా నేను సూసీ సూడక ఊరుకుంటా వున్నందుకు — మాకే నీతులు సెప్తావున్నావంట' — అని 'కాస్తంత సెప్పిన మాటినుకుంటా వుంటే మంచిది.' అంటూ కదిలి పో బోయేడు. తను బెరుగ్గా అన్నది, 'అది కాదు —'

ఆయన వినలేదు. 'అదేదో ఆడితో మాట్టాడు. ఆడు సెప్పినట్టు సెయ్. లేకపోతే పెద్దగొడవవుద్ది. ఆడు అసలే పట్టుదల మడిసి.' అంటూ వెళ్ళిపోయాడు.

తను గ్రుడ్లనీళ్ళు గుడ్డ కుక్కుకుంది. రామదాసుని తలుచుకుంటే భయమూ ముంచుకొచ్చింది; రక్తమూ వుడికిపోయింది.

రామదాసు ఆరాత్రి వచ్చేడు. తను విల్లేదు.

తర్వాత రెండు రాత్రులూ వచ్చేడు. తను వీల్లేదంది.

రాత్రి మళ్ళీ ప్రత్యక్ష మయ్యాడు. తను ససేమిరా అంది.

అతను పోతూ పోతూ హెచ్చరించి పోయాడు — 'రేపీ వేళకి నిన్నిక్కణ్ణుంచీ టపా కట్టించకపోతే నాపేరు రామదాసు కాదు'— అని. తనకు తెలుసు — రామదాసు వాళ్ళయ్యలాగానె మొండిఘటం. అందుకే ఇంత భయంగా వుంది తనకు. ఏ క్షణాన్నైనా రామదాసు విరుచుకు పడొచ్చు.

“ఏం తంగం, ఇయ్యాల ఈగల్ని తోలతా కూర్చుంటావ్?” అన్న ప్రశ్నకు ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చింది.

రాజయ్య వచ్చి బల్లమీద తంగం పక్కగా కూర్చున్నాడు.

ఆమె లేచి నిలబడింది.

'సింహాద్రిపురం పైగా గూడ్సు పట్టాలుతప్పిందట. ఇయ్యాల్టికి ఏ రైలూ టౌనుకెళ్ళే యోగం లేదంట. ఇంటికి పోతుండా' అని ఆమె కేసి వాళ్ళంతా కళ్ళు చేసుకు చూస్తూ — 'ఏదీ నీ చేత్తో వొక్క టీ

తెచ్చివ్వు' అన్నాడు. మౌనంగా గట్టుకేసి నడిచింది తంగం. టీ చేసి రాజయ్యకిచ్చింది. ఈలోగా స్టేషన్ నుంచీ పల్లెకు తిరిగి పోతున్న ప్రయాణీకుల్లో నలుగు రైదుగురు అక్కడ చేరేరు. టీకి ఆర్డరిచ్చి రైళ్ళ రాకపోకలమీద సంభాషణ సాగిస్తూ కూర్చున్నారు.

కుట్టి తల్లి దగ్గరసా వచ్చి ఆమె తయారుచేసిన టీ గ్లాసుల్ని వాళ్ళకి అందించ సాగింది. రాజయ్య టీ తాగటం పూర్తి చేసేడు. తంగంకేసి చూపి – లొట్టవేసి, వేళ్ళతో ఒకముద్రని అభినయించి – టీ బాగున్నదనే ఉద్దేశ్యం వెలిబుచ్చాడు. టీ డబ్బుల్ని కుట్టి చేతిలో పెట్టి ఆమె భుజంమీద అలవోకగా తట్టి బుగ్గ గిల్ల బోయేడు.

కుట్టి 'ఖఁయ్ ఖఁయ్' మన్నది – తన భాషలో.' ముక్కుమీద కోపం పిల్లకి' అని తనకు తానే పెద్దగా నవ్వుకుని ముందుకు కదిలేడు.

పాకలో కూర్చున్న వాళ్ళెవరో రాజయ్య వెనగ్గా కిసుక్కున నవ్వేరు. 'సరసానికి పగలూ రాత్రి లేదు రాజయ్యకి' అని వొకరంటే, 'సరసానికి తల్లీ కూతురూ తేడా కూడా లేదు రాజయ్యకి' అన్నారు మరొకరెవరో.

తంగంకీ కుట్టికీ మనస్సు చివుక్కుమంది. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. తల్లి తలదించుకుంది. కూతురు వంట గది వైపు వెళ్ళిపోయింది. రాజయ్య రాజసంగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

టీకి వచ్చినవాళ్ళు బల్లలు ఖాళీచేసి వెళ్ళిపోతుండగా–తడిక పక్క–నుంచీ నాయర్ అడిగేడు, 'టైమెంతయిందన్నా' అంటూ. చేతికి వాచీగలాయన చెప్పేడు, 'పదకొండున్నర' అని. వాళ్ళు వెళ్ళి పోయారు. తంగం లోపలికి కదిలింది. అందరూ అన్నాల దగ్గర కూర్చున్నారు.

ఇప్పుడు —

ఇంట్లో విచిత్రమైన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. పాడుబడిన బావిలో పీలగా కప్పల సందడి సాగుతోంది. ఒకరిద్దరి గుండెల్లో మాత్రం కుమ్మపొగ పెట్టినట్టుంది. టెన్షన్ స్ప్రింగ్‌ని బిగపట్టి బిగపట్టి పట్టుకున్నట్టుంది,

— పల్లెలో రెండున్నరయింది.

మూగ ఎండ కాస్తోంది. ఊరి మధ్యగావున్న పెద్దమర్రిక్రింద చాలా కోలాహలంగా వుంది. ఆడా మగా చాలామంది అక్కడచేరేరు. పిల్లలు సరేసరి. అందరికీ మధ్యగా అరుగుమీద తిమ్మయ్య తిష్టవేసి వున్నాడు. అతని పక్కగా రామదాసు – యుద్ధభేరిని మోగిస్తున్న సైనికుడిలా పిడికిలి బిగించి నిలబడ్డాడు. సైనికుల్ని ఉత్సాహపరుస్తున్న సైన్యాధికారిలా అన్నాడు తిమ్మయ్య, "ఉన్న సంగతులన్నీ మీకందరికీ తెలుసు. పల్లెను అప్రతిష్ట పాల్జేస్తున్న ఈ పనులు ఇంకెంతమాత్రం సాగడానికి వీల్లేదు. అందుకే పదండి. ఇయ్యాల్టితో ఈ యవ్వారం ఫైసల్ చేసుకుందాం."

అందరూ అవునవునంటూ అరిచారు. కొందరు అట్టాగేనన్నట్టు బుర్రలు వూపేరు. కొందరు క్రియాశీలం గల ఆడవాళ్ళు అప్పటికప్పుడే నడక సాగించారు.

జనప్రవాహం డొంకన పడింది. స్టేషన్ వైపు సాగింది.

ఇంటిముందు – పంచాయితీ అలజడి, ఆందోళన, సత్యాగ్రహం, నినాద ప్రదర్శన మొదలైంది.

— 'మావూళ్ళో ఇట్టాంటి నీతిలేని జనం ఉండేదానికి వీల్లేదు'– వో ఆడకూతురు పెద్దగా అరుస్తోంది, చేతులెత్తి కదం తొక్కుతోంది. శరీరాన్ని వదిలేసి ఆమె పమిట గాలిలో విహరిస్తుంటే, చాలా మగ కళ్లు ఆమె దేహాన్ని స్పృశిస్తున్నాయి.

'అవును....తల్లీ కూతురూ మరీ బరితెగించి పోయారు. పల్లెలో మగాళ్లంతా ఈళ్ల వలలో పడకముందే మనం మేలుకున్నాం' ఒక పతివ్రత ఆంతరంగికం.

తల్లీ కూతురూ – రెల్లుపాకలోపల మోకాళ్లల్లో మొహాలు దాచుకుని కూచునివున్నారు. పెనంమీద వేగుతున్న గింజలా కుక్కి-మంచంలో మసలుతున్నాడు నాయర్.

'స్టేషన్ కాడ నుంచీ వొచ్చే మగాళ్లని దారికాసి పాకలోకి లాక్కెడుతున్నారు – రాత్రుళ్లు' – జన్మలో తనకి ఆడదాని అవసరం లేదన్న ఫోజు పెట్టాడు వో చిట్టి అబ్బాయి.

'అనవసరమైన అరుపులెందుకు. అ చెప్పేదేందో చెప్పేస్తే సరి –'

తంగం తలెత్తి బయటికిచూసింది. ఆగొంతు తనకి చిర పరిచితమైనదే. గుంపు మధ్యలో రాజయ్య! పచ్చికలో పాములా కదులుతున్నాడు. రాజయ్యకూడా మందలో కలవడం చూసి తంగంకి కడుపు రగిలిపోయింది. రక్తం ఉడికిపోయింది.

'సెప్పేదానికేం లేదు. నీతీ జాతీ లేని ఈ తంగం దాని సంసారం ఈడుండే దానికి వీల్లేదు. ఈ జాగా ఖాళీ చేసి మన పల్లె నుంచీ ఎల్లిపోవాల'– తిమ్మయ్య మేఘంలా ఉరిమాడు.

'అవును – అంతే' రామదాసు తందానా అన్నాడు. జనమంతా తాన తందానా అన్నారు.

ఇక నిభాయించుకోలేక పోయింది తంగం. తోక తొక్కిన తాచులా, నాలుగు గోడల మధ్యన కొరడా దెబ్బలు తింటున్న పిల్లిలా లేచింది. సింహంలా గుంపు ముందుకు దూకింది. దిక్కు దిక్కుకూ చూస్తూ గర్జించసాగింది.

'అవును తల్లీ, మేము నీతిలేని మనుషులం. మరి మీ ఆయన్ని నాకాడ తొంగుండే దానికి తెలిసీ అన్నిసార్లు ఎందుకు పంపించావ్. నే వినకపొయ్యేసరికీ తప్పైపోయిందికదూ?' అని వో ప్రౌఢని నిలదీసింది.

'మేం బరితెగించిపోయాంవమ్మా నిజమే. చీకటి పడితే సరి — వాములదొడ్లో దూరతావంటెందుకు నువ్. మా బుడ్డోడు చూశాడటలే మీ పాలేరు నిన్ను లస లసా ముద్దెట్టుకోవడం' అని వో ఆరిందాని కడిగేసింది.

'మగాళ్లని మేం దారికాసి పాకలోకి లాక్కెడుతున్నాం కదూ చిట్టబ్బాయీ. మరి నువ్ మా రెండో అమ్మాయిని పట్నం లేచిపోదాం రమ్మని పోరుతుండా వంటగా, ఎందుకబ్బా?—' అని చిట్టి అబ్బాయిని నిలవేసింది.

'మాకు చెప్పేదేదో చెప్తావా రాజయ్యా. చెప్పు మరి. నా బంగారపు చేతుల్తో టీ కావాలిగా — ఎట్టాగయ్యా. మా కుట్టి బుగ్గ గిల్లబోవడం, భుజం తట్టడం — ఈ సరదాలెట్టా తీరతాయయ్యా,' అని రాజయ్యని ఏకేసింది.

జనం ఖంగు తిన్నారు. సవ్వళ్ళు తగ్గాయి. గుంపుకు వెనగ్గా నిలబడ్డ వాళ్ళు పలచ పలచబడి దూర దూరంగా కదల సాగేరు. ఆడ వాళ్ళు మొహామొహాలు చూసుకుంటున్నారు. తమ మొగుళ్ళు కూడా అక్కడే వున్న స్త్రీలు, వాళ్లకేసి చూసి మొహాలు మున మున లాడించుకుంటున్నారు.

క్షణం తర్వాత — మరింత గంభీరంగా ఉరిమింది తంగం, 'మేం నీతీ జాతీ లేని మనుషులమా? సరే — వొప్పుకుంటున్నాను. మరి మీ గ్రామ సింహం — పెద్ద దొర — తిమ్మయ్యగారో? — ఆయన గారికి

నేను కావాలి. ఐదేళ్లనుంచీ నా ప్రాణం తీస్తానే వున్నాడు. నేను వినలేదు. ఇవ్వాళ ఆయనగారి కొడుక్కి అడుగో ఆ రామదాసుకీ నేను కావాలిట'. క్షణంసేపు ఆగింది. 'నేను వీల్లేదన్నాను. కుట్టైనా సరే తన పక్కలోకి పంపమన్నాడు. ససేమిరా అది జరగదన్నాను. అందుకే మొదలైంది ఈ రగడ. చెప్పండమ్మా — మీరైతే ఏం చేస్తారు. ముందు మీరు తొంగుండి తర్వాత మీకూతుళ్లని పంపుతారా అతికాడికి—' కాళిలా విజృంభించింది తంగం. ఆమె గుండెలు ఎగిరెగిరి పడుతున్నై. దుఃఖం కట్టలు తెంచుకుంది. తమాయించుకోలేక పోయింది. మేఘం జోరున వర్షించేసింది.

వెక్కుతూ చెప్పసాగింది. 'ఏం మనుసులు — మీరంతా. ఐదేళ్ల నుంచీ నా సంసారాన్ని నేను సాక్కోవడానికి కుక్కచావు చస్తుంటే మీలో ఒక్కరు — కనీసం ఒక్కరన్నా సానుభూతి చూపారా? లేదు కానీ — మా శీలాన్ని గురించిన చర్చమాత్రం మీకు కావాలి. మేమెప్పుడూ 'మహాజనానికి మరదలు పిల్లల్లా' బతుకు తుంటే చూసి నవ్వాలని మీ కోరిక. మా మానాన్న మమ్మల్ని బతకనియ్యండి. పల్లె పల్లె అంతా కట్టకట్టుకుని మూకుమ్మడిగా కదిలొస్తే పారిపోయేదానికి నేనేమంత పిరికిదాన్నికాదు. పొండి. పోయి తిన్నది అరిగే దాకా మా గురించి ఇంకా ఇంకా గాలి కబుర్లు చెప్పుకోండి, పొండి.... పొండి—' ఆయాస పడుతూ కుప్పలా కూలిపోయింది.

ప్రవాహం కాస్తా రాళ్లమధ్య నీటి చుక్కలుగా మారింది.

— ఆ రాత్రి —

పల్లె తనను తాను పది చేత గుణించుకుంది.

తెల్లారే సరికీ —

పచ్చ పచ్చగా నవ్వుకుంటూ లేచింది పల్లె. తన స్థానబలిమికీ,

సంఘ బలిమికి గర్వపడూ్తూ మీసాలు మెలివేస్తూ వున్నై — కిర్రు చెప్పులూ, పొన్నుకర్రా !

ఇల్లుమాత్రం నీలం నీలంగా మండి బూడిద బూడిదగా ఏడ్చింది.

బాయిలేరూ, బొగ్గు తునకలూ స్థాన చలనం తమకు దిన దిన గండం కావచ్చేమోకానీ, ప్రాణాలు తియ్యలేదనే ఆత్మ విశ్వాసంతో సాగిపోతున్నాయి.

ఎక్కడికి — ? వేరే పల్లె కోసం. పల్లె లోనో, పల్లె బయటో వేరే యిల్లు కోసం ! !

అయితే — ఎక్కడైనా సరే —

ఇల్లు మాత్రం — ఒకటిలా ఒంటరిదే ! ! !